
ఆలయం ఎదుట పారుతున్న మురుగు

ఆలయంలోకి వెళ్లాలంటే.. డ్రైనేజీ దాటాల్సిందే.!

- ఆలయం ఎదుట నిత్యం మురుగు పరుగు
- ఇబ్బందులు పడుతున్న భక్తులు, స్థానికులు
- మురికి కాళ్లతో దేవాలయంలోకి వెళ్లాల్సిన దుస్థితి

చిక్కడపల్లి: ఆర్టీసీ క్రాస్‌ రోడ్డులోని శ్రీలక్ష్మీగణపతి దేవాలయంలో వినాయకచవితి ఉత్సవాలు నేటి నుంచే ప్రారంభం కానున్నాయి. కానీ భక్తులకు మాత్రం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎందుకంటే ఆలయంలోకి వెళ్లాలంటే మొదటి డ్రైనేజీ నీటిలో నడవాల్సిన దుస్థితి. ఎంతో పవిత్రంగా భావించే ఆలయంలోకి మురికిగా ఉన్న కాలితోనే అడుగు పెట్టాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవాలయానికి వచ్చే ఆదాయంపై దృష్టి పెట్టే ప్రజాప్రతినిధులు ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలనే ఆలోచన ఎందుకు చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు. శ్రీలక్ష్మీగణపతి ఆలయ ఎదుట ఉన్న డ్రైనేజీ నిత్యం పొంగిపొర్లుతోంది. ఈ సమస్యపై అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటున్నారు. శ్రీమయూరి థియేటర్‌ ఇతర అపార్ట్‌మెంట్‌ల నుంచి కూడా ఇదే డ్రైనేజీ గూండా వరదనీరు ప్రవహించడంతో చాలా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా వాటర్‌వార్క్స్‌ సీవరేజీ అధికారులు ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్‌ చేస్తున్నారు. వినాయక చవితికి ముందే ఈ సమస్య లేకుండా చూడాలన్నారు.


నిత్యం పొంగిపొర్లుతున్న డ్రైనేజీ

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం


ఐఏఎస్‌ చుక్క రామయ్యను సన్మానిస్తున్న నవోదయ విశ్రాంత ఉపాధ్యాయుడు శ్యామ్‌ప్రసాద్‌

ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో, కళాశాలల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. ఉపాధ్యాయులకు విద్యార్థులు శుభాకాంక్షలు తెలియజేశారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తరగతులను బోధించారు. సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించగా ఉపాధ్యాయులు పిల్లలుగా మారి నృత్యాలు చేస్తూ పిల్లలను అలరించారు. ముషీరాబాద్‌ ప్రభుత్వ పాఠశాలలో టీచర్స్‌డే సందర్భంగా ముషీరాబాద్‌ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉపాధ్యాయులు అందరికీ శుభాకాంక్షలు తెలిపి ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు.

– ముషీరాబాద్‌/అంబర్‌పేట జోన్‌ బృందం


ముషీరాబాద్‌ ప్రభుత్వ పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్‌ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్‌


మార్టినెంట్‌ స్కూల్‌ టీచర్లను సన్మానిస్తున్న గుల్షన్‌నగర్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు


డీడీవీటీఆర్‌సీ అధ్యాపకులకు బహుమతులు అందజేస్తున్న డీడీఎంఎస్‌ చైర్మన్‌ ఉషారెడ్డి


సుందరయ్య పార్కులో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహిస్తున్న వాకర్స్‌ సభ్యులు


కాచిగూడలోని శాంతినికేతన్‌ హైస్కూల్‌లో కాంగ్రెస్‌ నేతలు మహేష్‌యాదవ్, విజితారెడ్డి


నగర కేంద్ర గ్రంథాలయంలో సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు నివాళులర్పిస్తున్న సంస్థ కార్యదర్శి పి.పద్మజ, ప్రతిభారెడ్డి, సీతామహాలక్ష్మి


ఇందిరాపార్కులో నవభారత్‌ లయన్స్‌క్లబ్‌ ఆధ్వర్యంలో టీచర్స్‌డే వేడుకలు

చుక్కా రామయ్య గ్రంథాలు విద్యారంగానికి కరదీపికలు

నల్లకుంట: అద్భుతమైన బోధనాపాటవంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోని వేలాది మంది విద్యార్థులను ప్రతిష్టాత్మకమైన ఐఐటీలకు పంపించిన ఘనత ఐఐటీ చుక్క రామయ్యకే దక్కుతుందని నవోదయ విశ్రాంత ఉపాధ్యాయుడు డా. శంకరమంచి శ్యామ్‌ప్రసాద్‌ అన్నారు.గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పుస్కరించుకొని మాజీ ఎమ్మెల్సీ, ప్రముఖ విద్యావేత్త ఐఐటీ చుక్క రామయ్యను విద్యానగర్‌లోని ఆయన నివాసంలో కలిసి సన్మానించి శంకరమందీయం పుస్తకాన్ని అందజేశారు. విద్యావేత్తగా, సామాజిక విశ్లేషకుడిగా ఆయన రాసిన వ్యాసాలు, గ్రంథాలు విద్యారంగానికి కరదీపికలని పేర్కొన్నారు. తన వ్యాసాలతో లక్షలాది మంది విద్యార్థులు, వేలాది మంది ఉపాధ్యాయులను ప్రభావితం చేసిన మహోన్నత వ్యక్తి చుక్క రామయ్య అని కొనియాడారు.

బతుకు నేర్పేవాడే ఉపాధ్యాయుడు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బతుకు నేర్పేవాడే ఉపాధ్యాయులని వాకర్స్‌ క్లబ్‌ ఆఫ్‌ హైదరాబాద్‌ సెంట్రల్‌ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్‌.వివేక్, పి.వెంకటస్వామిగౌడ్‌ అన్నారు. గురువారం సుందరయ్య పార్కులో క్లబ్‌ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రవికుమార్, నందకిషోర్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులను శాలువాలు, మెమోంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హౌజ్‌ ఫెడ్‌ డైరెక్టర్‌ అయిలినేని కిషన్‌రావు, క్లబ్‌ మాజీ అధ్యక్షులు ఎం.దామోదర్‌రెడ్డి, ఎస్‌.రమేష్‌రెడ్డి, పీవీ నిరంజన్‌రెడ్డి, హర్షవర్ధన్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

దుర్గాబాయి దేశ్‌ముఖ్‌ వీటీఆర్‌సీలో వేడుకలు

నల్లకుంట: విద్యానగర్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్‌ వొకేషనల్‌ ట్రెనింగ్‌ అండ్‌ రిహాబిలిటేషన్‌ సెంటర్‌(డీడీవీటీఆర్‌సీ)లో గురువారం డీడీహెచ్‌ ఆర్సీ ఆడిటోరియంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో మానసిక వికలాంగులు తమ నృత్యాలతో అలరించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన డీడీఎంఎస్‌ చైర్మన్‌ ఎన్‌. ఉషారెడ్డి డీడీవీటీఆర్‌సీ విద్యార్థులు, అధ్యాపకులకు బహుమతులు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీడీవీటీఆర్సీ కార్యదర్శి సునంద, ప్రిన్సిపల్‌ ఎ.పద్మ, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


హైమావతి పాఠశాలలో ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

మట్టి గణపతుల పంపిణీ

మట్టి గణనాథులను పూజిద్దాం: ఎమ్మెల్యే కాలేరు



అంబర్‌పేట: మట్టి గణపతులను పూజించి పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ పిలుపునిచ్చారు. గురువారం బాగ్‌ అంబర్‌పేట సీఈ కాలనీలో కార్పొరేటర్, బి.పద్మా వెంకట్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ప్రజలకు మట్టి గణేష్‌ ప్రతిమాలను అందించారు. గణేష్‌ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని ఆయన ఆకాక్షించారు. ఉత్సవాలు ఆధ్యాత్మిక వాతవరణాన్ని వ్యాపింప చేసేలా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో డాక్టర్‌ హేమలత, బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకులు బి. వెంకట్‌రెడ్డి, శ్రీరాములు ముదిరాజ్, చందు, సీఈ కాలనీ ప్రతినిధులు వెంకట్రావ్‌ తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతులను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడాలి: పాశం యాదగిరి.

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరు మట్టి గణపతులను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడాలని సీనియర్‌ జర్నలిస్టు పాశం యాదగిరి పిలుపునిచ్చారు. గురువారం సుందరయ్య పార్కులో హైదరాబాద్, జిందాబాద్‌ ఆధ్వర్యంలో మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌ జిందాబాద్‌ ప్రధాన కార్యదర్శి వీరయ్య, క్లబ్‌ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వివేక్, వెంకటస్వామి, వాకర్స్‌ క్లబ్‌ డిస్ట్రిక్ట్‌ గవర్నర్‌ మురళీకృష్ణ, రమేష్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, కిషన్‌రావు, శైలజమోహన్, స్కైలాబ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కాచిగూడ: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను పూజించాలని సీనియర్‌ కాంగ్రెస్‌ నేత, జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్‌ దిడ్డి రాంబాబు అన్నారు. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో గురువారం బర్కత్‌పుర పార్కులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన భక్తులకు మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు.

నగర జీజేసీపీఏ అధ్యక్షుడిగా డా. చిరంజీవి

కాచిగూడ: హైదరాబాద్‌ జిల్లా ప్రభుత్వ జూనియర్‌ కాలేజ్‌ ప్రిన్సిపాల్స్‌ అసోసియేషన్‌ (జీజేసీపీఏ) అధ్యక్షుడిగా డాక్టర్‌ ఎ.చిరంజీవి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను కాచిగూడ లెక్చరర్లు, సిబ్బంది గురువారం కళాశాలలో అభినందించి సత్కరించారు. ఎన్నికైన ప్రిన్సిపాల్స్‌ అసోసియేషన్‌ నూతన కార్యవర్గాన్ని కృష్ణమోహన్‌ ఈ సందర్భంగా ప్రకటించారు. ఉపాధ్యక్షురాలిగా అనసూయ (ఫలక్‌నుమా), కార్యదర్శిగా బి.చెన్నయ్య (మలక్‌పేట), సంయుక్త కార్యదర్శిగా సి.అంజన్‌కుమార్‌ (ప్రభుత్వ సిటీ కాలేజ్), కోశాధికారిగా సీహెచ్‌ ప్రభాకర్‌రెడ్డి (సికింద్రాబాద్), మహిళా కార్యదర్శిగా జి.సునిత (మైసారం), కార్యవర్గ సభ్యులుగా డాక్టర్‌ పి.సెల్మా రాజకుమారి (చంచల్‌గూడ), కోట విజయ భాస్కర్‌ రెడ్డి (నాంపల్లి) ఎన్నికయ్యారు.

ఉపాధ్యాయ దినోత్సవం...

ఉపాధ్యయ దినోత్సవం సందర్భంగా కాచిగూడ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డా. చిరంజీవి మాట్లాడారు. ఉపాధ్యాయులు భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్‌ సర్వేపల్లి రాధాకృష్ణ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరే విధంగా కృషి చేయాలన్నారు.

బీజీయూఎస్‌ ముషీరాబాద్‌ అసెంబ్లీ కోకన్వీనర్‌గా శక్తిసింగ్‌

ముషీరాబాద్‌: భాగ్యనగర్‌ గణేష్‌ ఉత్సవ సమితి (బీజీయూఎస్‌) ముషీరాబాద్‌ అసెంబ్లీ కోకన్వీనర్‌గా శక్తిసింగ్‌ నియమితులయ్యారు. గురువారం భాగ్యనగర్‌ గణేష్‌ ఉత్సవ సమితి హైదరాబాద్‌ అధ్యక్షులు ఏ.వినయ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు రాఘవరెడ్డి నియామకపత్రాన్ని అందజేశారు. ముషీరాబాద్‌ నియోజకవర్గంలో గణేష్‌ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు తనవంతు కృషి చేస్తానని శక్తిసింగ్‌ తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్దూరి శివాజీ, రాంరెడ్డి, మహేందర్‌బాబు, సందీప్, ఆయూష్‌ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ దొంగల అరెస్ట్‌

రెండు ద్విచక్ర వాహనాలు, 85 వేల నగదు స్వాధీనం.

ముషీరాబాద్‌: పార్కు చేసిన ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడే ఇద్దరు వ్యక్తులతో పాటు, వాటి విడిభాగాలను తక్కువ ధరకు విక్రయించే మరో ముగ్గురు వ్యక్తులను ముషీరాబాద్‌ పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రూ.85 వేల నగదును,రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. గురువారం ముషీరాబాద్‌ పోలీస్‌స్టేషన్‌లో చిక్కడపల్లి ఏసీపీ ఎల్‌.రమేష్‌కుమార్‌ ముషీరాబాద్‌ ఇన్‌స్పెక్టర్‌ జి.రాంబాబు, ఎస్సైలు చలపతిరెడ్డి, ప్రేమ్‌కుమార్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. భోలక్‌పూర్‌ డివిజన్, ఇందిరానగర్‌కు చెందిన అబ్దుల్‌ ముజీబ్‌ ఆగష్టు 23న పార్సిగుట్ట చౌరస్తాలోని ఎంఎస్‌ఆర్‌ బార్‌ ఎదుట బైక్‌ పార్కు చేశాడు. బయటికి తిరిగివచ్చి చూగా తన వాహనం కనిపించకపోవడంతో ఆగస్టు 26న ముషీరాబాద్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు బార్‌ వద్ద ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించగా ఇద్దరు వ్యక్తులు వాహనాన్ని దొంగలించినట్లు గుర్తించారు. నిందితులను భోలక్‌పూర్‌కు చెందిన మహ్మద్‌ ఖాజా హుస్సేన్, యూసుఫ్‌ పాషాగా గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించగా ఐదు బైక్‌లు చోరీ చేసినట్లు అంగీకరించాడు. మూడు వాహనాలను విడదీసి భోలక్‌పూర్‌లోని స్క్రాప్‌ వ్యాపారులు మహ్మద్‌ సద్దాముద్దీన్, మహ్మద్‌ రేహమత్‌హుస్సేన్, మహ్మద్‌ గులం దస్తగిరిలకు విక్రయించినట్లు వెల్లడించాడు. దీంతో ముగ్గురు వ్యాపారులను అరెస్ట్‌ చేసిన పోలీసులు వారి నుంచి రూ.85 వేలు రికవరీ చేసినట్లు తెలిపారు. కేసు ఛేదించిన పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

తప్పించుకు తిరుగుతున్న ఇద్దరి రిమాండ్‌

చిక్కడపల్లి: బాకీ డబ్బులు అడిగిన కేసులో పాన్‌షాప్‌ కేఫ్‌ యాజమానిని అభిలాష్, టీమాస్టర్‌ రఫీక్‌ను కొట్టిన కేసులో ఇద్దరు వ్యక్తులను చిక్కడపల్లి పోలీసులు అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం సీఐ సీతయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బాగ్‌లింగంపల్లి మూన్‌కేఫ్‌ పక్కన ఉన్న ఎస్‌ పాన్‌షాప్ , కేఫ్‌ నిర్వాహకుడు కె.అభిలాష్(33), టీ మాస్టార్‌ మహ్మద్‌ రఫీ(33)లను షాప్‌లో ఉండగా బాగ్‌లింగంపల్లిలో నివసించే జి.నరేష్(33), రెగ్యులర్‌గా వచ్చి సిగరేట్‌ తీసుకుంటాడు. కాగా అతను పాత బకాయిలు సుమారుగా రూ.8వేలు ఇవ్వాల్సి ఉంది. బాకీ డబ్బులు ఇస్తేనే సిగరేట్‌ ఇస్తానని అనడంతో గొడవ పెట్టుకున్నాడు. తన తమ్ముడైన డి.నవీన్‌నాయుడు ఆలియాస్‌ చోటు(29) మరికొంత మంది స్నేహితులతో కలసి అదనంగా తనకు రూ.2వేలు బాకీ డబ్బులు ఇవ్వడం లేదనే సాకుతో బండరాయితో రఫిక్‌ తలపైన కొట్టి అడ్డుకోబాయిన అభిలాష్‌ను కూడా కొట్టి గాయాపరిచారు. దీంతో గాయాలపాలైన అభిలాష్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని గురువారం నరేష్, నవీన్‌నాయుడు ఆలియాస్‌ చోటు అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

గణేష్‌ మండపానికి సీసీ కెమెరాల అందజేత


సీసీ కెమెరాలను అందజేస్తున్న సెంట్రల్‌ పీస్‌ కమిటీ ఈజెడ్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ శరత్‌శ్యామ్‌

కాచిగూడ: వినాయకచవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గణేష్‌ మండపాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సెంట్రల్‌ పీస్‌ కమిటీ ఈస్ట్‌జోన్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ ఎస్‌.శరత్‌ శ్యామ్‌ సూచించారు. గురువారం కాచిగూడ, చెప్పల్‌బజార్‌లో ఏర్పాటు చేయనున్న భారీ గణేష్‌ మండపానికి ఆయన సీసీ కెమెరాలను నిర్వాహకులు సాయిబాబాకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గణేష్‌ నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో సంఘటితంగా జరుపుకోవాలన్నారు. హిందూవుల ఆరాధ్యదైవమైన గణపతి పూజలతో అందరికి మంచే జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఏవైనా సమస్యలు ఏర్పడితే, స్థానిక పోలీస్‌స్టేషన్‌ పోలీసులకు గానీ, సెంట్రల్‌ పీస్‌ కమిటీ ప్రతినిధులకు గానీ తెలియజేస్తే వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గణేష్‌ మండప నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని అన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

చిక్కడపల్లి: ఆధ్యాత్మికతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని రిటైర్డ్‌ న్యాయమూర్తి జస్టిస్‌ కాశీవిశ్వేశ్వర్‌రావు అన్నారు. గురువారం త్యాగరాయ గానసభ నిర్వహణలో ప్రముఖ రచయిత పురాణపండ శ్రీనివాస్‌ అపురూప రచనా సంకలనం గణానాం త్వ గ్రంథావిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వినాయక చవితికి సంబంధించిన విశేషాలు సంపుటిలో ఉన్నాయన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షత వహించినే కార్యక్రమంలో ఆధ్యాత్మికవక్త అనంతలక్ష్మి, గీతాదేవి, ఉష, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.


గణానాం త్వ గ్రంథావిష్కరణ చేస్తున్న జస్టిస్‌ కాశీవిశ్వేశ్వర్‌రావు

అపూర్వ సమ్మేళనం

నల్లకుంట: రెండు దశాబ్దాల ఏళ్ల క్రితం వారంతా కలిసి పదో తరగతి చదువుకున్నారు. ఆ తరువాత ఉన్నత చదువులు చదివి వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. రెండు దశాబ్దాల తరువాత ఒకరినొకరు కలుసుకుని గత స్మృతులను నెమరు వేసుకున్నారు. ఈ మధురక్షణాలకు నల్లకుంటలోని శ్రీ రామ విద్యా సమితి ఎయిడెడ్‌ ఉన్నత పాఠశాల వేదికైంది. న్యూ నల్లకుంటలోని శ్రీరామ ఉన్నత పాఠశాలకు చెందిన 2000–2001 బ్యాచ్‌ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని పూర్వ విద్యార్థుల ఆహ్వాన కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం పాఠశాల ఆవరణలో జరిగింది. రెండు దశాబ్దాల క్రితం తమతో చదువుకున్న స్నేహితులను కలుసుకుని గత స్మృతులను నెమరు వేసుకుంటూ ఫొటోలు తీసుకుని ఎంతో సంతోషంగా గడిపారు. అలాగే ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని 23ఏళ్ల క్రితం తమకు విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులు భానుమతి, సుబ్బలక్ష్మి, రాజ్యలక్ష్మి, నిర్మల, రమావాణి తదితరులను శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేసి, పాదాభివందనం చేశారు.



రేపటి నుంచి శ్రీలక్ష్మీగణపతి నవరాత్రి మహోత్సవాలు



చిక్కడపల్లి: నగరంలో ప్రసిద్ధి గాంచిన ఆర్టీసీ క్రాస్‌ రోడ్డులోని శ్రీలక్ష్మీ గణపతి దేవాలయంలో స్వామివారి నవరాత్రి మహోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నట్లు కార్యనిర్వాహణ అధికారి పాశం లక్ష్మారెడ్డి తెలిపారు. గురువారం దేవాలయంలో ఆయన మాట్లాడుతూ... ఈనెల7వ తేదీ నుంచి 19వ తేదీ వరకు జరిగే స్వామి వారి నవరాత్రి మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

దౌర్జన్యంగా ప్రవేశించడం కోర్టు ఉల్లంఘనే...

చిక్కడపల్లి: హెబ్రోను చర్చిలో ట్రస్టు సంబంధించిన వ్యక్తులు దౌర్జన్యంగా లోపలికి ప్రవేశించి నిర్వహణను అబాసుపాలు చేస్తున్నారని క్రైస్తవ ధర్మప్రచార పరిరక్షణ సమితి అధ్యక్షుడు జెరుసలెం మత్తయ్య ఆరోపించారు. గురువారం సాయంత్రం ఆయన గాంధీనగర్‌లో మాట్లాడారు. హెబ్రోను వ్యవస్థాపకులు దైవజనులు బ్రదర్‌ భక్తసింగ్‌ సొసైటీని ఏర్పాటు చేసి ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఎంతో క్రమశిక్షణతో నిర్వహించారని గుర్తుచేశారు. ఈ నెల 6, 7వ తేదీలలో ట్రస్టు ఆధ్వర్యంలో హెబ్రోను చర్చిలో తలపెట్టిన దైవసేవకులు,బాధ్యుల సమావేశాలను సొసైటీ సభ్యులు పాల్గొనవద్దన్నారు. కోర్టు కేసు కొనసాగుతుండగా ట్రస్టు ప్రతినిధులు దౌర్జన్యంగా ప్రవేశించడం కోర్టు ఉల్లంఘనే అవుతుందన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు



చిక్కడపల్లి: టీజేఎస్‌ వ్యవస్థాపకులు, ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నియోజవర్గ కన్వీనర్‌ మెరుగు శ్రీనివాస్‌ యాదవ్‌ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రొ. కోదండరాం కేక్‌ కట్‌ చేశారు. ఈ సందర్భంగా పార్టీ గ్రేటర్‌ కన్వీనర్‌ నర్సయ్య, నేతలు జైపాల్‌రెడ్డి, గుండెల్లి రవీందర్‌యాదవ్, వెంకయ్య తదితరులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

చిక్కడపల్లి: మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ అన్నారు. గురువారం డివిజన్‌లోని జవహర్‌నగర్‌ కమ్యూనిటీహాల్‌లో పారిశుద్ధ్య కార్మికులకు రిక్షా పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు పావని వినయ్‌కుమార్, రచనశ్రీ, డీఎంసీ ఖాదర్, ఏఎంహెచ్‌వో డాక్టర్‌ ప్రవీణలతో కలసి ఆయన ముఖ్యఅతిథిగా పంపిణీ చేసి మాట్లాడారు. వరుసగా కురుస్తున్న వర్షాలతో వ్యాధులు ప్రబలుతున్న ఉండాలన్నారు. రోడ్లపై చెత్తను చేయకుండా సేకరించేవారికి అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేత వినయ్‌కుమార్, బీఆర్‌ఎస్‌ నేత ముఠా జైసింహ పాల్గొన్నారు.


కార్మికులకు రిక్షా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్లు, అధికారులు

వరద బాధితులను ప్రభుత్వాలు ఆదుకోవాలి

బీఎల్‌పీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ దండి వెంకట్‌



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వర్షాలకు నష్టపోయిన ప్రజలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని బహుజన లెఫ్ట్‌ పార్టీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ దండి వెంకట్‌ డిమాండ్‌ చేశారు. బాగ్‌లింగంపల్లిలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకట్‌ మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా కుండపోతగా కురుస్తున్న భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలు, ఇళ్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధప్రతిపాదికన తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్‌ చేశారు. ఇటీవల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు తీవ్రంగా నష్టపోవడం జరిగిందన్నారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు, తెగిపోయిన చెరువు, కుంటల మరమ్మత్తులను వెంటనే చెపట్టాలని డిమాండ్‌ చేశారు. అంతేకాకుండా వర్షాలకు ఉపాధి కోల్పోయిన రోజువారి వ్యవసాయ కార్మికులు, భవన నిర్మాణ, ఆటో కార్మికులకు ఐదు వేల రూపాయలు, 50 కిలో బియ్యాన్ని పంపిణీ చేయాలన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి

చిక్కడప్లలి: ముషీరాబాద్‌ నియోజవర్గంలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులకు నిధులను మంజూరు చేసి పునః ప్రారంభించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ గురువారం జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ ఆమ్రపాలిని కోరారు. అభివృద్ధి పనులకు సంబంధించిన వినతి పత్రాన్ని ఆమెకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.... నియోజవర్గంలోని అన్ని డివిజన్‌లో నూతన రోడ్లు, కచ్చానాలాల నిర్మాణం, తదితర అభివృద్ధి పనులకు నిధులు మంజూరు అయ్యాయని అన్నారు. ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయని అన్నారు. ఇందిరాపార్క్‌లో స్విమ్మింగ్‌పూల్, టెన్నిస్‌ కోర్టు పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు ముఠాజైసింహ, ముచ్చకుర్తి ప్రభాకర్‌ తదితరులు పాల్గొన్నారు.


జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ ఆమ్రపాలికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముఠా జైసింహ, ప్రభాకర్‌